క్లుప్తంగా

శివారు భూములకు సాగు నీరందించాలి

ఏలూరు (టూటౌన్): కృష్ణా డెల్టా శివారు ప్రాంత ఆయకట్టు భూములకు సాగునీరు అందించి పంటలను కాపాడాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆదివారం కోరారు. కృష్ణా డెల్టాకు శివారు ప్రాంతాంగా ఉన్న కై కలూరు, దెందులూరు నియోజకవర్గాల్లో వేలాది ఎకరాల వరి పంటకు సక్రమంగా సాగునీరు అందక రైతులు, కౌలురైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పొట్ట, ఈనిక దశలో ఉన్న వరి పంటకు సాగునీరందకుంటే రైతులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేసారు. పట్టిసీమ కాలువ నీరును కృష్ణా కాలువలకు యుద్ధప్రాతిపదికన మళ్లించి పంటలను కాపాడాలని శ్రీనివాస్ కోరారు.

2 నుంచి పాట్నాలో బీకేఎంయూ జాతీయ మహాసభలు

ఏలూరు (టూటౌన్): భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) 15వ జాతీయ మహాసభలు నవంబరు 2 నుంచి 5వ తేదీ వరకూ బీహార్ రాజధాని పాట్నాలో నిర్వహించనున్నట్టు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు తెలిపారు.స్థానిక స్ఫూర్తి భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జాతీయ మహాసభల వివరాలను ఆయన వెల్లడించారు. ఈ జాతీయ మహాసభలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి 11 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. జాతీయ మహాసభలలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రజా వ్యతిరేక విధానాలపై, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల పట్ల వ్యతిరేక చర్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్టు తెలియజేసారు. ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేసే విధంగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చే పోరాట కార్యాచరణ మహాసభ రూపొందిస్తుందన్నారు.

డీసీఎంఎస్ ద్వారా బాణసంచా విక్రయం

పెదపాడు: సామాన్య ప్రజలకు నాణ్యమైన బాణసంచాను తక్కువ ధరకే విక్రయాలు జరపడం మంచి పరిణామమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీపావళి సామాను విక్రయ కేంద్రాన్ని డీసీఎంస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్యతో కలిసి ఆదివారం ప్రారంభించారు. డీసీఎంఎస్ ద్వారా తక్కువ ధరకే అందిస్తున్నందున ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. స్టాండర్డ్ కంపెనీకి చెందిన బాణసంచాను హోల్‌సేల్ ధరలకే విక్రయిస్తున్నట్లు చెప్పారు. త్వరలో భీమవరం నిడుదవోలులో బాణసంచా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి ఆళ్ల సతీష్‌చౌదరి, ఉపసర్పంచ్ చింతా మధుసూధనరావు, కత్తుల రవికుమార్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగు


పోణంగి జగనన్న కాలనీలో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది (ఫైల్)


జగనన్న కాలనీల్లో ఇళ్లకు విద్యుత్ మీటర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

- ఐదువేల ఇళ్లకు ఉచితంగా కరెంట్ కనెక్షన్
- 39 వేల మందికి రూ.19.50 కోట్ల లబ్ధి
- ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.5 వేలు లబ్ధి

ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో ప్రతి పేదవాడి ఇంటికీ ఉచిత కరెంట్ అందిస్తోంది. విద్యుత్ శాఖ అధికారులు ప్రతి ఇంటికీ సర్వీస్ వైర్, మీటర్, బోర్డు, ఎంసీబీ, ఎర్త్ వైర్ బిగిస్తున్నారు. దీనివల్ల ఒక్కొక్క లబ్ధిదారుడికి సుమారు రూ.5 వేలు లబ్ధి చేకూరుతోంది. ఇంటి నిర్మాణం పూర్తికాగానే ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది నేరుగా లబ్ధిదారుడు వద్దకు వెళ్లి ఆధార్, ఇంటి స్థలం పట్టా జెరాక్స్ తీసుకుంటున్నారు. మీటర్ మంజూరు కోరుతూ ఏపీ ట్రాన్స్‌కో వెబ్‌సైట్‌లో పత్రాలు అప్‌లోడ్ చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం కరెంట్ కనెక్షన్ అందిస్తోంది. దీని నిమిత్తం లబ్ధిదారుడు ఒక్కపైసా కూడా చెల్లించాల్సిన పని లేదు. ఉచితంగా మీటర్ ఏర్పాటు చేయడం వల్ల ఏలూరు, ఏలూరు రూరల్ గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో 39 వేల మంది లబ్ధిదారులకు రూ.19.50 కోట్లు లబ్ధి చేకూరనుంది.

24 గంటల్లో మీటర్ బిగింపు

ఏలూరు, ఏలూరు రూరల్ గ్రామాల్లో ప్రభుత్వం మొత్తంగా సుమారు 39 వేల ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. ఇందులో లక్ష్మీపురం, పోనంగి, కొమడవోలు, చాటపర్రు, మల్కాపురం, కొమడవోలు, మాదేపల్లి, లింగారావుగూడెం, జాలిపూడి, పైడిచింతపాడు తదితర గ్రామాలున్నాయి. ఇంటి నిర్మాణం పూర్తి చేసిన వారికి 24 గంటల్లో కరెంట్ కనెక్షన్ ఇవ్వాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఇప్పటి వరకూ 5 వేల ఇళ్లకు అధికారులు మీటర్లు బిగించారు. ఫలితంగా లబ్ధిదారులు రూ. 2.50 కోట్లు లబ్ధి పొందారు.

నిరంతరం విద్యుత్

కాలనీల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకోసం రూ.45 కోట్లు వెచ్చిస్తోంది. కొమడవోలు, పోణంగి, లక్ష్మీపురం, గుడివాకలంకలో సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు రూ.16 కోట్లు కేటాయించింది. ఇప్పటికే వందలాది విద్యుత్ స్తంభాలు పాతారు. మొత్తంగా కాలనీలన్నింటికీ కలిపి సుమారు 120 కిలోమీటర్ల దూరం గల కరెంట్ లైన్ సిబ్బంది ఏర్పాటు చేశారు.

ఉచితంగా కరెంట్ ఇచ్చారు



జగనన్నకాలనీలో నా ఇంటికి అధికారులు ఉచితంగా కరెంట్ కనెక్షన్ ఇచ్చారు. ఇల్లు పూర్తి కాగానే సిబ్బంది వచ్చి మీటర్ బిగించారు. ఒక్క పైసా కూడా ఇవ్వనవసరం లేదు. మా కాలనీలో అందరికీ ఉచితంగా మీటర్లు బిగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నా సొంతింటి కల సాకారం చేసారు. దరకాస్తు చేసుకున్న వెంటనే స్థలం ఇచ్చారు.

– ఎం నాగేశ్వరమ్మ, శనివారపుపేట

పేదలందరికీ ఇళ్ల స్థలాలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి చరిత్ర సృష్టించారు. దరకాస్తు చేసుకున్న 90 రోజుల్లో అర్హత కల్గిన పేదలదరికీ స్థలాలు ఇచ్చారు. మరో ఏడాదిలో రాష్ట్రంలో ఇల్లు లేని పేద వాడు ఉండడు. గతంలో ఇల్లు కావాలంటే ఏళ్ల తరబడి ఎదురుచూడాలి. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం లక్షలాది స్థలాలు మంజూరు చేసింది.

– తంగెళ్ల రాము, 15 డివిజన్ కార్పొరేటర్

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి


నిరసన తెలుపుతున్న బహుజన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల కావలిలో ఆర్టీసీ డ్రైవర్ రామ్‌సింగ్‌పై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించి ఆర్టీసీ విధుల్లో ఉన్న వారికి రక్షణ కల్పించాలని ఆర్టీసీ బహుజన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనకు నిరసనగా ఆర్టీసీ బహుజన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన ఏలూరు డిపో శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఏలూరు ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. భౌతిక దాడులు ఉద్యోగుల్లో నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిర్రా శాంసన్, జిల్లా కార్యదర్శి బీవీఎస్ నారాయణ, ఎస్సీ,ఎస్టీ రాష్ట్ర నాయకుడు గోరింక అనిల్ కుమార్, బీఎస్పీ ఏలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దేవరపల్లి రత్నబాబు, దెందులూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కర్రే అంబేద్కర్, భారత్ బచావో జిల్లా కార్యదర్శి పాము రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి


సంఘీభావం తెలుపుతున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని, కడప జిల్లాలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 8న విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆదివారం ఆయా సంఘాల నాయకులు స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భూషణం మాట్లాడుతూ నవంబర్ 8న రాష్ట్రవ్యాప్త బంద్‌కు ఇచ్చిన పిలుపునకు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, యాజమాన్యాలు సహకరించాలని కోరారు. ఏవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. లెనిన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ విభజన హామీల్లో భాగంగా కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని నాటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.క్రాంతి, ఎం.జానకిరామ్ పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ సంబరాలు


ఏలూరు నవాబ్ పేటలో గంగానమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించిన గంగానమ్మ సంబరాల్లో ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని పాల్గొన్నారు. స్థానిక నవాబ్ పేట, బావిశెట్టి వారి పేట తదితర ప్రాంతాల్లో ప్రజలు ఆదివారం గంగానమ్మ సంబరాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి చద్ది, వేడి నైవేద్యాలు సమర్పించి కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఊరేగింపులు ఆయా ప్రాంతాల్లోని వీధుల్లో వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ నగరంలోని ప్రతి ప్రాంతంలో గ్రామ దేవత గంగానమ్మ సంబరాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించడం ఆచారంగా వస్తోందన్నారు. ఈ ఆచారాన్ని ఇప్పటికీ కొనసాగిస్తూ ప్రజలు అమ్మవార్లను ఆరాధించడం శుభపరిణామమన్నారు. అమ్మవారి కరుణా కటాక్షాలు నగర ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని నాని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, పార్టీ నాయకులు, గంగానమ్మ ఉత్సవ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక


హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘానికి నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ సాంస్కృతిక సంస్థ హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన సంఘ సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పెదపాటి రామకృష్ణ, గండికోట రాజేష్ ఎన్నికయ్యారు. సంఘ గౌరవ సలహాదారులుగా మోదుగు కృష్ణారావు, లంకా వెంకటేశ్వర్లు, కడిమి గోవిందరావు, పైడి భీమేశ్వరరావు ఎన్నికయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షుడిగా పీ. విజయ్‌కుమార్, వల్లముల రామాంజనేయులు, మహ్మద్ ఖాజా వలీ, సహాయ కార్యదర్శులుగా సంకు సురేష్, మండవ రాజగోపాలకృష్ణ, వై. అర్జునరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఘంటసాల పెద్దిరాజు, ఎం. సూర్యనారాయణ యాదవ్, ఎస్. కస్తూరి రావు, పచ్చ కృష్ణానంద రావు, కోశాధికారిగా కొచ్చర్లకోట వెంకట సుబ్బారావు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా టీ. లోకేష్, సీహెచ్ లలితకుమారి, ఆరేపల్లి రవి ప్రకాష్, పీ. సూర్యప్రకాష్, కే. శ్రీదేవి, ఏ. రగంబాబు, నక్కా ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు మాట్లాడుతూ కళలకు కాణాచి అయిన హేలాపురి నగరంలో కళలను ఆదరించేందుకు, కళాకారులను ప్రోత్సహించేందుకు ఏర్పడిన ఈ సంఘాన్ని మరింత అభివృద్ధి చేసి కళా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని, పేద కళాకారులను ఆదరించడానికి దాతల సహకారం తీసుకుని సంఘ ఆశయాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయిని నిర్మలకు గురు స్పందన పురస్కారం


ఉపాధ్యాయిని నిర్మల కుమారికి గురు స్పందన పురస్కారం అందజేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యా రంగంలో చేస్తున్న విశేష కృషికి గురు స్పందన పురస్కారాన్ని ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. స్థానిక ఆర్ఆర్‌పేట అతిథి హోటల్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేస్తున్న బీ. నిర్మలకుమారికి గురు స్పందన పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఎల్‌సీ షేక్ సాబ్జి, ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి పీ. శ్యామ్ సుందర్, ఫౌండేషన్ ఛైర్మెన్ ఈద శామ్యూల్ రెడ్డి మాట్లాడుతూ విద్యా రంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వచ్చారని, దీంతో ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యకు నాంది పలికారని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

క్రమశిక్షణతో లక్ష్య సాధన

దెందులూరు: దేవుని ఆశీస్సులు, క్రమశిక్షణ, సత్ప్రవర్తన, కృతనిశ్చయంతోనే లక్ష్యాలను సాధించవచ్చని ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పీ.బాల అన్నారు. ఆదివారం వేగవరం ఆర్‌సీఎం చర్చిలో వేగవరం విచారణ ఫాదర్ పీ.మోజెస్ ఆధ్వర్యంలో వికార్ జనరల్ గురుత్వ మహోత్సవం నిర్వహించారు. తొలుత ఫాదర్ రాజ్‌కుమార్, ఫాదర్ ఎం.బాలస్వామి, ఫాదర్ వై.దేవానందం, ఫాదర్ మోజెస్ ఆధ్వర్యంలో వికార్ జనరల్ ఫాదర్ బాల కృతజ్ఞత దివ్యపూజాబలి అర్పించారు. అనంతరం వేగవరం శనివారపుపేట, జోసెఫ్ నగర్ యూత్, ఫాదర్లు, సిస్టర్లు, సంఘ పెద్దలు, సంఘస్తులు, ఉపాధ్యాయులు వికార్ జనరల్ ఫాదర్ బాలను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ఓపీఎస్ అమలు చేయాలి

పెదవేగి : ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల అభ్యున్నతి ఓపీఎస్‌ను కొనసాగించాల్సిందేనని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అన్నారు. యూటీఎఫ్ పెదవేగి మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ సాబ్జి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని జీపీఎస్, సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను మాత్రమే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. యూటీఎఫ్ పెదవేగి మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూటీఎఫ్ పెదవేగి మండల గౌరవాధ్యక్షుడిగా తేరా ప్రభాకర్(పినకడిమి), అధ్యక్షుడిగా టి.ఎడ్వర్డు (పెదవేగి), సహ అధ్యక్షుడిగా బీవీ రావు(లక్ష్మీపురం), కె.రామలక్ష్మి (ప్రకాష్ నగర్). కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	23
డీ.తిరుమల ఏలూరు బీహెచ్ఈఎల్	22.15	31
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	23

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	05
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	19
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	15
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	07
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	25
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	18	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	30	ములక్కాడలు	08-10
బెండకాయలు	20	కంద	50
పచ్చిమిర్చి	48	బీట్‌రూట్	44
కాకర కాయలు	24-28	కీరా దోస	40
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	124
క్యాబేజీ	24	అల్లం	130
క్యారెట్	54	కొత్తిమీర (కట్ట)	28
దొండకాయలు	18	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	60	తోటకూర	10
గోరుచిక్కుడు	28	గోంగూర	06
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	15- 20	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	30
		నిమ్మకాయలు (డజను)	--

వృద్ధులను జాతీయ సంపదగా భావించాలి

ఉంగుటూరు: వృద్ధులను జాతీయ సంపదగా భావించాలని వృద్ధుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి అన్నారు. ఆదివారం ఉంగుటూరులో వృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొండ్రెడ్డి సర్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నారాయణమూర్తి మాట్లాడుతూ 50 ఏళ్లపాటు కుటుంబానికి సేవచేసిన వ్యక్తి నేడు వృద్ధ వయస్సులో నిరాధరణకు గురవుతున్నారని అన్నారు. వృద్ధులు సుఖంగా ఉండేలా ప్రభుత్వాలు, సమాజంలో అన్ని వర్గాలు బాధ్యత తీసుకోవాలని నారాయణమూర్తి అన్నారు. అన్ని రంగాల్లో వృద్ధులకు ప్రాధాన్యం కల్పించాలని అన్నారు. వృద్ధుల సంరక్షణ చట్టం 2010లోనే అమలులోకి వచ్చిందని అన్నారు. వృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. శివరామకృష్ణరావు మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమ సంఘంలో సభ్యులు సంఖ్య పెరగాలని, సంఘం బలోపేతం అవ్వాలని అన్నారు. ఏపీ రాష్ట్ర వృద్ధుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానకిరామరాజు మాట్లాడుతూ వృద్ధుల హక్కులు కాలరాస్తే సహించేది లేదన్నారు. జిల్లా జనరల్ సెక్రటరీ బి. సత్యనారాయణ, వృద్ధుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.రాధాకృష్ణ, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు మాట్లాడారు. వృద్ధులకు సంఘీభావం తెలిపారు.

సచివాలయం, ఆర్‌బీకే భవన నిర్మాణం పూర్తి

దెందులూరు: దెందులూరులో రూ.43.6 లక్షలతో సచివాలయం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణాలు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో ఎస్ఎంఆర్ నగర్‌లో పూర్తయ్యాయి. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారంతో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, నిధుల మంజూరుతోనే త్వరితగతిన ప్రభుత్వ కార్యాలయాలు పూర్తయ్యాయని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు అన్నారు. ఆదివారం నిర్మాణం పూర్తయిన రెండు ప్రభుత్వ కార్యాలయాలను వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు, పార్టీ దెందులూరు గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, ఎంపీటీసీలు తాళ్లూరి నాగరాజు, తోట విజయకుమారి, పులిపాటి ఆనంద్, దెందులూరు ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి పరిశీలించారు. రెండు భవనాల నిర్మాణం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి


బీసీ కులాల జేఏసీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): రజకులను ఎస్సీల్లో చేర్చాలని, బోయ, వాల్మీకి కులాలను ఎస్టీల్లో చేర్చాలంటూ బీజీ కులాల జేఏసీ సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బీసీ కులాల జేఏసీ సమావేశం యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం స్థానిక ఏటిగట్టులోని జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కుల సంఘాల నాయకులు మాట్లాడారు. సమాజంలో అణగారిన కులాలను సామాజికంగా పరిపుష్టి చేసేందుకు రిజర్వేషన్లలో మార్పు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలంతా ఐక్యంగా ముందుకు సాగుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో వాటా పెరిగిందన్నారు. అదే విధంగా అన్ని రంగాల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాల్సిందిగా సమావేశం విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య, వివిధ బీసీ సంఘాల నాయకులు అన్నపరెడ్డి మురళి, కెళ్ళ కన్నబాబు, గంగత్తెర సుధాకర్, మరడ అనిల్‌కుమార్, కాగిత అచ్చుత్ పూలే, తాతపూడి చందు, కింజంగి రాజు, పరిటాల వీరాస్వామి, సూరగాని రవిశంకర్, నల్ల రామారావు పాల్గొన్నారు.

వెండి, బంగారు ఆభరణాల చోరీ

పెదపాడు: ఇంటిలో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోని రూ.30వేల విలువైన బంగారు, వెండి, ఆభరణాలు చోరీ అయినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలు ప్రకారం సత్యవోలు గ్రామానికి చెందిన కరణం సాయి దత్తు ఈనెల 20న ఇంటికి తాళం వేసి ఊరెళ్లి 26న ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటికి వచ్చేసరికి వెనుక ఉన్న తలుపు తీసి ఉండటంతో ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడినట్లు గుర్తించారు. ఇంట్లో వస్తువులు వెండి కుందెలు, వెండి పట్టీలు, బంగారం ఆభరణం చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.